క్లుప్తంగా

నేడు రాఘవేంద్ర స్వామి ఆరాధన



కొత్తకోట రాఘవేంద్ర స్వామి పీఠం

సి.బెళగల్: కొత్తకోటలోని శ్రీ రాఘవేంద్ర స్వాముల వారి పీఠంలో సోమవారం స్వామివారి 354వ ఆరాధన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆలయ ట్రస్టీ లక్ష్మణదాస్ తెలిపారు. సి.బెళగల్ మండల పరిధిలోని కొత్తకోట గ్రామ శివారులో తుంగభద్ర నదీతీరంలో స్వాముల వారి బృందావన పీఠం ప్రవేశ దినం సందర్భంగా ఆరాధన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఇందుకుగాను ఆదివారం ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆరాధన కార్యక్రమల్లో భాగంగా సోమవారం భక్తుల సమక్షంలో పల్లకీ సేవ, అనంతరం రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ ఉటుందని, భక్తులు ఆరాధనోత్సవాలలో పాల్గొని శ్రీహరి వాయు గురువుల కృపకు పాత్రులు కావాలని ట్రాస్టీ కోరారు.

బంగారు పడిగె వితరణ



బంగారు పడిగెను అందిస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి వారికి దాతలు 10 గ్రాములు బంగారు పడిగెను బహూకరించినట్లు ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బనగానపల్లె పట్టణానికి చెందిన నవీన్‌కుమార్, గీత దంపతులు తమ ఇలవేల్పు స్వామి వారికి 10 గ్రాముల బంగారు పడిగెను బహూకరించారన్నారు. పడిగె విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. దాతల కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో శేషవస్త్రాలు అందించినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. ఆమె ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పకుండా హాజరవ్వాలని, హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు.

సుగాలిమెట్టలో కార్డెన్ సెర్చ్



నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్టలో ఆదివారం పాణ్యం పోలీసులు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. అలాగే సుగాలిమెట్ట గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో నాటుసారా బట్టీలను గుర్తించి ధ్వంసం చేశారు. ఎవరైనా సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

గజదొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్టు చూపుతున్న కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు

(టౌన్): చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. గత కొంతకాలంగా కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రయాణికుల బ్యాగుల దొంగతనాలు జరుగుతున్నాయి. బాధితులు నాలుగవ పట్టణ పోలీసులకు, ఆర్టీసీ బస్టాండ్ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కేసులు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాగ్ లిఫ్టింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడు నంద్యాల పట్టణంలో ఉన్నట్లు గుర్తించారు. డీఎస్పీ నేతృత్వంలో కర్నూలు నాలుగవ పట్టణ సీఐ విక్రమసింహ, ఎస్‌ఐ మోహన్ కిషోర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎస్ఏ.ఖాద్రి, ఎస్.షాకీర్, కానిస్టేబుల్ ఎల్లా శివుడు, సుబ్బరాయుడు, లక్ష్మణ్, నాయక్ ప్రత్యేక బృందంగా ఏర్పడి నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామం రాములవారి వీధికి చెందిన గున్న అంజిని అరెస్టు చేసినట్లు కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్ ఆదివారం తన కార్యాలయంలో వెల్లడించారు. నిందితుడి నుంచి 16 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలను సంబంధిత యజమానులకు కోర్టు ద్వారా అప్పగిస్తామని డీఎస్పీ తెలిపారు.

బాబు వచ్చె.. జాబు పోయే!

- నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- వలంటీర్ వ్యవస్థకు మంగళం
- చిరుద్యోగులపై ఉక్కుపాదం
- బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు
- చంద్రబాబు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పనిచేస్తున్న శాఖలు	తొలగించిన చిరుద్యోగుల సంఖ్య
వలంటీర్లు	196
ఫీల్డ్ అసిస్టెంట్లు	10
ఎండీయూ (రేషన్ బియ్యం పంపిణీ వాహనం)	20
వీఓఏ (పొదుపు కార్యాలయంలో)	7
మధ్యాహ్న భోజన నిర్వాహకులు	8



గత ప్రభుత్వంలో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుకు కాటా వేయిస్తున్న వీఓఏ (ఫైల్)



యువతకు ఉద్యోగాలు లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామంటూ టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ

గడివేముల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులపై వేధింపులు అధికమయ్యాయి. బాబు వస్తే జాబు గ్యారెంటీ అని, లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నిండా ముంచేశారు. అధికారం చేపట్టి సంవత్సరం దాటినా కొత్త ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేకపోగా, చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్న వారిని తొలగించి పొట్టకొట్టారు. వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది గడివేముల మండలంలోని ఉద్యోగులు, నిరుద్యోగుల పరిస్థితి. బాబు వస్తే అభివృద్ధి పరుగులు పెట్టిస్తాడని, ఉద్యోగాలు వస్తాయని టీడీపీ నాయకులు మండలంలో ఊరూరా గడప గడపకూ తిరిగి మరీ గత ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. కానీ, అధికారంలోకి అడుగు పెట్టిన వెంటనే సీఎం చంద్రబాబు కుట్ర బట్టబయలైంది. మోసం చేయడం తన నైజం.. నమ్మి మోసపోవడం మీ తప్పు అన్నట్లుగా ఉద్యోగుల పనిబట్టారు. ఒక్కొక్కటిగా ఉద్యోగాలను ఊడగొట్టే పనిలో పడ్డారు.

నాడేమో వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామని హామీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయవంతంగా అమలు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశవ్యాప్తంగా ఎంతో పేరుపొందింది. ఈ వ్యవస్థను అలాగే కొనసాగిస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా గెలిచాక వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత లేదంటూ తొలగించారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలను రోడ్డున పడేశారు. జీతం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మబలికి చివరకు ఆ ఐదు వేలు కూడా లేకుండా చేశారు. దీంతో కూటమికి ఓటు వేసి మోసపోయామంటూ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను, మధ్యాహ్న భోజన కార్మికులను బలవంతంగా తప్పించారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని మీకు చేతనైంది చేసుకోండంటూ స్థానిక నాయకులు బయటకు గెంటేశారు. వేలాది మంది ఉద్యోగులు జీవనోపాధి కోల్పోయి బతుకుదెరువు లేక అల్లాడిపోతున్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ రద్దుతో ఉపాధికి చేటు

వయస్సు పైబడి రేషన్ షాపునకు వెళ్లలేని వారు, దివ్యాంగులకు ఉపయుక్తంగా ఉన్న ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు రద్దు చేశారు. ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో 20 మంది దాకా డ్రైవర్లు, ఆపరేటర్లకు జీవనోపాధి లేకుండా పోయింది. స్వయం సహాయక సంఘాల పద్దులు రాసే వీఓఏలను సైతం చంద్రబాబు వదల్లేదు. గత ప్రభుత్వంలో పనిచేసిన వీఓఏలను కూటమి ప్రభుత్వం రాగానే తొలగించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్ వ్యక్తులకు మద్యం విక్రయాలకు వీలు కల్పించడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు బజారున పడ్డారు. కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టకపోతే చాలంటూ ఉద్యోగులు, ప్రజలు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా పనిచేశాం



ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిలా పారదర్శకంగా పనిచేశాం. కోవిడ్ సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలందించాం. మంచి పనులు చేస్తూ అందుకుంటున్న చిన్నపాటి గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం మాకు దక్కకుండా చేయడం సమంజసం కాదు. ఎన్నికల సమయంలో గౌరవ వేతనం రూ.10 వేలు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీరు వ్యవస్థను తొలగించడంతో ఖాళీగా ఇంటి వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం అమలు చేయాలి.

– ఎల్ల రాముడు, వలంటీరు, గడివేముల

కార్మికుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు: కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. ఆదివారం కల్లూరు మండలం దూపాడు గ్రామంలో ఆంజనేయులు అధ్యక్షతన సీఐటీయూ రెండో మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, సీపీఎం జిల్లా కా ర్యదర్శి, మండల కార్యదర్శి ఎ.కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మెను నిర్వహించామన్నారు. కార్మికులకు రాజకీయ చైతన్యం అవసరమన్నారు. అనంతరం నూతనంగా 15 మందితో సీఐటీయూ మండల కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌గా కె.మధు, కో-కన్వీనర్‌గా బి.చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హమాలీ, ఆటో, భవన నిర్మాణం, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సార్బీసీలో వ్యక్తి గల్లంతు

పాణ్యం: మండల కేంద్రలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో వ్యక్తి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. నాగపూర్ నుంచి వేలూరుకు కెమికల్ లోడ్‌తో లారీ బయలుదేరగా పాణ్యం సమీపంలో ఎస్సార్బీసీ కాల్వ వద్ద నిలిపి డ్రైవర్ స్నానం చేయడానికి కాల్వలో దిగాడరన్నారు. ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి గల్లంతైనట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వంతెన సమస్య తీరేదెన్నడో?

- లోతట్టు బ్రిడ్జిపై వర్షపు నీరు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రజలు



లోతట్టు వంతెనపై నీటిలో దిగి వాగును దాటుతున్న గ్రామస్తులు

పాణ్యం: మండల పరిధిలోని గగ్గటూరు – రాయపాడు గ్రామాల మధ్య లోతట్టు బ్రిడ్జితో ఇరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గగ్గటూరు గ్రామం ముందు ఉన్న ఊరు వాగుపై గతంలో లోతట్టు బ్రిడ్జి నిర్మించారు. వాగుకు కంటే తక్కువ ఎత్తులో బ్రిడ్జిని నిర్మించారు. వాహనాలు ఈ బ్రిడ్జిపై వెళ్లాలంటే లోయలోకి దిగి ఎక్కినట్లు ఉంటుంది. చిన్నపాటి వర్షానికే వాగులో నీరు లోతట్టు బ్రిడ్జిపైకి ఎక్కి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. దీనికి తోడు వర్షాకాలం కావడంతో భారీ వర్షాలకు బ్రిడ్జిపై 5–8 అడుగుల వరకు నీరు ప్రవహిస్తుంది. నీటి ఉధృతి వల్ల రెండు గ్రామాల నుంచి రాకపోకలు నెల వరకు నిలిచిపోయాయి. క్రమంగా నీరు తగ్గడంతో బ్రిడ్జిపై రాకపోకలు సాగుతున్నాయి. అది కూడా ఎంతో జాగ్రత్తగా వెళ్లాలి. బ్రిడ్జిపై అడుగు మందంలో పాచి పేరుకుపోయింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే సంగతి. సరాసరి వాహనంతో సహా వాగులో పడతారు. అంతేగాక బ్రిడ్జికి రెండువైపులా ఇనుప కమ్మీలు (అంగ్లేర్స్) కూడా లేవు. నీరు ఏ మాత్రం ప్రవహిస్తుందనే విషయం కూడా తెలియదు. గతేడాది వినాయక నిమజ్జనం రోజునే ఓ బాలుడు బ్రిడ్జిపై నుంచి జారి వాగులో పడి మృతి చెందాడు. బ్రిడ్జి పైకి ఎక్కిన వెంటనే ప్రమాదకరంగా మలుపు ఉంటుంది. దీంతో వాహనాలను అదుపు చేయలేక చాలా మంది వాగులో పడ్డారు.

వారంలో రెండు రోజులు వాహనాల రద్దీ

గగ్గటూరు పక్కనే కొత్తూరు సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇక్కడ ప్రతి ఆది, మంగళ వారాల్లో విశిష్ట పూజలు జరుగుతాయి. ఈ పూజలు చేసేందుకు, స్వామి వారికి ముక్కులు తీర్చుకునేందుకు ఆళ్లగడ్డ, కొవెలకుంట్ల, చాగలమర్రి, దొర్నిపాడు లాంటి మండలాల నుంచి వేలాదిగా భక్తులు ఈ దారి నుంచి ఆలయానికి వెళుతుంటారు. ప్రతి మంగళ, ఆది వారాల్లో ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, జీపులు, ఎడ్ల బండ్లు, లారీలపై భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ క్రమంలో వర్షాకాలం నెల రోజుల పాటు నీటి ప్రవాహం వల్ల రాకపోకలు నిలిచిపోయి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యపై గ్రామస్తులు అనేక సార్లు అధికారులకు వినతులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి బ్రిడ్జి ఎత్తు పెంచాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

టెండర్లు పంపించాం

బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.2.50 కోట్లతో ప్రతిపాదలు పంపాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. టెండర్లు పిలవడానికి ప్రక్రియ జరుగుతోంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఇప్పటికే పూర్తి డిజైన్‌లతో అధికారులకు నివేదిక పంపాం. టెండర్ల ప్రక్రియ త్వరలో ముగుస్తుంది.

– ఉసేనయ్య, ఆర్అండ్‌బీ ఏఈ, బనగానపల్లె

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



బి.తాండ్రపాడులో పార్టీ శ్రేణులతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌బాబు, వైస్ ఎంపీపీ నెహెమ్యా

కర్నూలు(రూరల్): వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ పేరపోగు మోహన్‌బాబు, కర్నూలు మండల వైస్ ఎంపీపీ నెహెమ్యా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో ఆదివారం ఆయన నాయకులు, గ్రామ కార్యకర్తలతో రచ్చబండ వద్ద సమావేశమయ్యారు. ఆయన మాట్లడుతూ.. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే కూటమి సర్కారు ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. భవిష్యత్ వైఎస్సార్‌సీపీదేనని గుర్తుచేశారు. కార్యకర్తలు సమష్టిగా పనిచేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా కలిసికట్టుగా పోరాటం సాగించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చిన్న మద్దయ్య, చంద్ర, సలీం, రామస్వామి రెడ్డి, కే.జయరాముడు, బషీర్, ఆనంద్, సాధిక్, శ్రీను, మద్దిలేటి, మాధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

తుగ్గలి : ఐదు రోజుల క్రితం తప్పిపోయిన మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. రాతనకు చెందిన రాఘవరెడ్డి(65) ఈనెల 6న బళ్లారిలో జరిగిన బంధువుల పెళ్లికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మానసికస్థితి సరిగా లేని ఆయన అక్కడ తప్పిపోయారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఆలూరు బస్టాండ్‌లో అచేతనంగా పడి ఉన్న ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నీరసించిపోయిన ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామం రాతనకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య హనుమంతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీక రాఖీ



ఆదిమూలపు సతీష్‌కు రాఖీ కట్టిన వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

కర్నూలు(రూరల్): కోడుమూరు నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఎ.క్యాంప్‌లోని ఆదిమూలపు సతీష్ నివాసంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మండల అధ్యక్షురాలు అజిమా, ఉమ మహేశ్వరమ్మ తదితరులు ఆయనకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీక రాఖీ అన్నారు.

17న పరుగు పందెం

మద్దికెర: ఈనెల 17న శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని ఎం.అగ్రహారం గ్రామంలోని శ్రీకృష్ణుడి ఆలయం నుంచి మద్దికెరలోని శ్రీకృష్ణుడి ఆలయం వరకు 3.5 కి.మీ దూరం రాయలసీమ స్థాయి పరుగుపందెం పోటీలు నిర్వహించనున్నారు. వివరాలకు సెల్ 98852 97904 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వంపై నమ్మకం లేక..
సొంతంగా రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపై గుంతను పూడ్చుతున్న యువకులు

పాణ్యం: రోడ్లను బాగు చేసి వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఉత్తిదేనని తేలిపోయింది. కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంకా వేచి చూసినా ప్రభుత్వం రోడ్లను బాగు చేస్తుందన్న నమ్మకం లేకపోవడంతో తమ్మరాజుపల్లె గ్రామ యువకులు సొంతంగా రోడ్డును బాగు చేసుకునేందుకు నడుంబిగించారు. మండల పరిధిలోని తమ్మరాజుపల్లె– సిమెంట్‌నగర్ గ్రామాల మధ్య ఘాట్ రోడ్డుపై భారీ గుంతలతో అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం తమ్మరాజుపల్లె గ్రామ యువకులు రంగంలోకి దిగి రోడ్డుపై గుంతలను పూడ్చివేశారు. మినీ వాహనంలో తారు, ఇతర మిశ్రమ మెటీరియల్‌ను కలిపి గుంతలను పూడ్చి రోడ్డును బాగు చేశారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అదుపుతప్పితే అంతే!



పాణ్యం డొంగులో ఓహెచ్ ఎస్ఆర్ మెట్లకు గ్రిల్ దెబ్బతిన్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రంలోని డొంగు వద్ద నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు ఎక్కాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పైకి ఎక్కాల్సిందే. ఏ మాత్రం అదుపు తప్పినా అంతే సంగతి. ట్యాంకు మెట్లకు ఏర్పాటు చేసిన గ్రిల్ దెబ్బతిన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరిచేయలేదు. దీంతో ట్యాంకు పైకి ఎక్కే సమయంలో సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంకులను శుభ్రం చేసే సమయంలో, ఏమైనా సమస్యలొచ్చినా ట్యాంకు పైకి ఎక్కాల్సి ఉంటుంది. ట్యాంకు మెట్లకు అమర్చిన గ్రిల్‌ను కోతులు ఊడగొట్టాయి. అధికారులు చర్యలు తీసుకోని ట్యాంకు మెట్లకు గ్రిల్‌ను అమర్చాలని సిబ్బంది కోరుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- వీధుల్లో మురుగునీటి ప్రవాహం
- దోమల వృద్ధితో అవస్థలు
- పట్టించుకోని అధికారులు



పడిదెంపాడులో పూడికతో నిండిన డ్రైనేజీ

కర్నూలు(రూరల్): గ్రామాల్లో మురుగు ముందుకు కదలనంటోంది.. నివాసాల పక్కనే చెత్త చెదారం పేరుకుపోతోంది. పారిశుద్ధ్యం మెరుగునకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నా అది కేవలం ప్రచారానికే పరిమితమైంది. చెత్త తొలగించే కార్యక్రమాలు చేపట్టకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది.

వీధుల్లోనే మురుగు

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాల్లో పక్కా డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగు పారుతోంది. దీంతో వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమల బెడద అధికం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలవ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో పడిదెంపాడు, ఆర్.కె.దుద్యాల, దిగువపాగు, జి.సింగవరం, ఆర్. కొంతలపాడు, సుంకేసుల, పంచాలింగాల, తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. అధికారులలు పారిశుద్ధ్య పనులను గాలికి వదిలేశారు. కార్మికులు ఉన్నా గ్రామాల్లో చెత్త చెదారాన్ని తొలగించడం లేదు. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. ఇక ఇళ్లలోని వాడకం నీరు, మురుగు నీటితో కలిసి రోడ్లమీద పారుతోంది. మురుగు నీటి నిల్ల ఏర్పడటంతో దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమల బాధ భరించలేక సాయంత్రం కాగానే ప్రజలు ఇళ్లకు తలుపులు వేసుకుంటున్నారు. అధికారులు సిబ్బంది విధులకు హాజరయ్యామా? వెళ్లామా? అనే పరిస్థితి తప్ప విధి నిర్వహణలో జవాబుదారీతనం కొరవడింది. మండల స్థాయి అధికారులు సైతం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడం లేదు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ఒక్కరోజు ఆర్భాటంగా నిర్వహించడం ఆ తర్వతా కార్యక్రమ ఉద్దేశాన్ని గాలికి వదిలేయడం పరిపాటిగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కేంద్రాలకు చెత్త తరలించకపోవడంతో అవి కాస్తా నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపైనే మురుగునీరు



మా వీధిలో పారిశుద్ధ్యం లోపించింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. లింగమయ్య కట్ట పరిసర ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే పడేస్తున్నారు. డ్రైనేజీ పూడికతో నిండి మురుగు నీరు ముందుకు కదలక తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే రోడ్డుపైనే మురుగు నీరు పారుతోంది. దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై చర్యలు చేపట్టాలి.

– చిన్న నాగేష్, బీసీ కాలనీ, పడిదెంపాడు



జి.సింగవరం ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు పారుతున్న మురుగు



పంచలింగాల ఎస్సీ కాలనీలో లోపించిన పారిశుద్ధ్యం